ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 20.04.2025 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో సాగు నీటికి, త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
2. తెలంగాణ ఆర్టీసీలో త్వరలోనే 3,038 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
3. తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఆనవాళ్ళు చెరిపి వేయడం ఎవరి తరం కాదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు అన్నారు.
4. ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈ రోజు, రేపు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

..................................................

**భట్టి విక్రమార్క**

రాష్ట్రంలో సాగు నీటికి, త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామంలో ఈ రోజు ఐటిఐ భవనానికి, చెక్ డ్యాం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వేసవిలో కూడా రైతులకు సాగునీరు అందించే

విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేశామని ఆయన చెప్పారు. మధిర నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పిటిసి, ఖమ్మం

**సన్న ధాన్యం**

సన్నధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న క్వింటాల్ కు రూ.500 బోనస్ తెలంగాణ రైతులకే దక్కేలా చూడాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బోనస్ లబ్ధి పొందేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా సన్నవడ్లను ఇక్కడికి తరలించే అవకాశాలు ఉన్నాయని, వాటిని అడ్డుకునేందుకు సరిహద్దుల్లో చెక్ పోస్టులు, సీసీ కెమెరాలతో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు సూచించారు.

(DESK)

**కొనుగోలు కేంద్రాలు**

రాష్ట్రంలో ఎనిమిది వేల 329 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పటికే ఏడు వేల 337 కేంద్రాలు ప్రారంభమైనట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, మిగిలిన జిల్లాలో వరికోతలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభిస్తున్నట్లు వారు వివరించారు. ఆయా కేంద్రాలకు ఇప్పటిదాకా 8.51 లక్షల టన్నుల ధాన్యం రాగా 5.77 లక్షల టన్నులు కొనుగోలు చేశామని, అందులో సన్నరకాలు 3.79 లక్షల టన్నులు, దొడ్డురకాలు 1.98 లక్షల టన్నులు ఉన్నట్లు వారు వెల్లడించారు.

(DESK)

**ఆర్టీసీ- పొన్నం**

తెలంగాణ ఆర్టీసీలో త్వరలోనే 3,038 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్

ఉద్యోగాలు, 84 ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్, 114 మెకానికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ , 25 డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 సివిల్ అసిస్టెంట్ ఇంజినీర్, 11 సివిల్ సెక్షన్ ఆఫీసర్, 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉంటాయని మంత్రి వివరించారు.

(DESK)

**బండి సంజయ్**

తెలంగాణ లో వక్ఫ్ ఆస్తుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల వర్ఫ్ బోర్డు భూములు ఉన్నాయని, వాటి ద్వారా వెయ్యి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా ఒక్క పేద ముస్లిం కుటుంబానికి కూడా న్యాయం జరగడం లేదని ఆయన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటింగ్ ప్రక్రియను బహిష్కరించేది మావోయిస్టులేనని, ఈ ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు కూడా వారి వారసులేనని బండి సంజయ్ విమర్శించారు.

(DESK)

**స్వచ్ఛ భారత్**

స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ కు రాష్ట్ర వాటా కింద 516 కోట్ల రూపాయల రుణం మంజూరు చేయాలని తెలంగాణా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వ వాటాకింద 60 శాతం నిధులు విడుదల కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 40 శాతం నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేసి పనులను చేపట్టనుంది. ఈ పథకం కింద ఒక్కో మరుగుదొడ్డికి 12 వేల రూపాయల చొప్పున మొత్తం లక్షా 90 వేల మరుగుదొడ్లు, 410 సాధారణ సామూహిక

మరుగుదొడ్లు, పల్లెల్లో 100 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, ఇంకుడు గుంతలు, వాటర్ మేనేజ్మెంట్ షెడ్లను నిర్మించనున్నారు.

(DESK)

**హజ్ యాత్ర**

హైదరాబాద్ మీదుగా హజ్ యాత్రకు వెళ్తున్న 17 రాష్ట్రాలకు చెందిన 12 వేల మంది యాత్రికులకు తెలంగాణ హజ్ కమిటీ సౌకర్యాలు కల్పిస్తుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. హైదరాబాద్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల హజ్ కమిటీల సమన్వయ సమావేశంలో షబ్బీర్‌అలీ మాట్లాడుతూ, హజ్ యాత్రికులకు అవసరమైన సదుపాయాలు కల్పించి సహాయ, సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి ఫారూఖ్ సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ నుంచి 1,200 మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని ఆయన తెలిపారు. హజ్ యాత్ర కోసం 31 విమానాలు ఏర్పాటు చేయగా ప్రయాణ షెడ్యూల్ ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఏడు విమానాలు మదీనాకు, 24 విమానాలు జెడ్డాకు వెళ్తాయి.

(DESK)

**ఉపాధి హామీ- బైట్**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ ఏడాది పండ్ల తోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ ముల్క అరుణ చెప్పారు. ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ, జాబ్ కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు ఈ సహాయానికి అర్హులని తెలిపారు.

BYTE (PTC/RS)

**ఇందిరమ్మ ఇళ్లు**

కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన లబ్దిదారులకు మొదటి విడత డబ్బులు వారి వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాకు రెండు వేల 27 ఇళ్లు మంజురుయ్యాయి. వీటిలో 702 మంది లబ్ధిదారులు పనులు ప్రారంబించారు. బేస్ మెంట్ లెవెల్ పనులు పూర్తి అయిన 85 ఇళ్ల లబ్దిదారులకు లక్ష రూపాయల చొప్పున 85 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.

(PTC/KR)

**రాజనర్సింహ**

సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ అధికారులతో వేసవి తాగునీటి సమస్యలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రణాళిక బద్ధంగా మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో నీటి కొరత లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా 90% ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

(PTC/SR)

**సీతక్క**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అధికారులతో సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, టెండర్ దశ నుంచే పనులు వేగవంతంగా ప్రారంభించి, వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ ప్రారంభం కాని పనులకు వెంటనే కొత్త టెండర్లు పిలవాలని

సూచించారు. జిల్లాలోని సమాఖ్య సంఘాలకు, మెప్మాలకు మంజూరైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

(PTC/NML)

**బ్రహ్మోత్సవాలు**

వికారాబాద్ జిల్లా తాండూరులో శ్రీ బావిగీ భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి ఇందులోప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకను నిన్న అర్ధరాత్రి నిర్వహించారు. ప్రతి యేడాది చైత్ర మాసంలో జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో రథోత్సవం, లంకాదహన వేడుకలు కన్నుల పండుగగా జరుగుతాయి తాండూరుతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా ఈ ఉత్సవాలకు తరలి వచ్చారు.

(PTC/VKB)

**వాతావరణం**

మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా కర్ణాటక, రాయలసీమ వరకు ద్రోణి ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. కొన్ని జిల్లాల్లో సాధారణం కన్నా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. కాగా, నిన్న ఆదిలాబాద్ లో 43.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది.

(DESK)

**చిరంజీవి**

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం అందరూ పాటుపడాలని సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవి అన్నారు. హైదరాబాద్ లోని టి వర్క్స్ లో నోటి క్యాన్సర్ పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల కట్టడికి ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. వ్యసనాలకు బానిసలై తమ కలలను దూరం చేసుకుంటున్న యువతను కాపాడుకోవాలని చిరంజీవి అన్నారు.

డెస్క్

**ఈస్టర్**

మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు – శిలువ నుంచి పునరుత్థానం పొందిన ఈస్టర్ ఆదివారాన్ని ఈ రోజు క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ఆశ, విశ్వాసం, కొత్త జీవితాల సందేశంగా క్రైస్తవులు ఈస్టర్ ను జరుపుకుంటారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవులు చర్చిలలో ప్రార్థన జరిపి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

డెస్క్

వరంగల్

వరంగల్ జిల్లాలో వచ్చే రెండు రోజులు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య శారద సూచించారు. ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని అన్నారు.

పిటిసి, వరంగల్

**శుభాకాంక్షలు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కృషి చేయడంలో చంద్రబాబుకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

డెస్క్

ఐపిఎల్

ఐపిఎల్ లో ఈ మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు ఛండీగడ్ లో జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు పోటీ పడతాయి. రాత్రి 7.30 కి ముంబైలో జరిగే మరో మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ – చెన్నైసూపర్ కింగ్స్ జట్లు తలపడతాయి.

ఎన్ఎస్ డి

**కెటిఆర్**

తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఆనవాళ్ళు చెరిపి వేయడం ఎవరి తరం కాదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు అన్నారు. ఈ రోజు హైదరాబాద్ లో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.... గత ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి పార్టీకి కంటే ప్రజలకే నష్టం అని ఆయన అన్నారు. జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బిజెపి రెండూ తెలంగాణ శత్రువులేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై స్వల్ప కాలంలోనే, ప్రజల భ్రమలు తొలగిపోయాయని ఆయన అన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ 500 రోజులు అయినా అమలు కాలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పతనమైందని తారక రామారావు అన్నారు.

డెస్క్

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.